# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

"ఎవరా పోయేది...?" మొదటి ప్రాకారంలో గాలిగోపురం పక్క నుంచి ఓ ముసలి గొంతు వినిపించేది.

"నేనేనండయ్యా" తోటకూర అమ్ముకోడానికొచ్చిన అబ్బాయి సమాధానం చెప్పేవాడు.

"ఇటురా! నాయనా!" అని సూరయ్యస్వాములవారు పిలిచి "బుట్ట దింపుకో" అనేవారు. బుట్ట దింపుకున్న తర్వాత "మీది కునికినపాడేనా?" అని పరామర్శించగా, "మరేనండి! ఇప్పుడే రేవు దాటివచ్చానండి" అని అతను బదులుచెప్పగా సూరయ్యస్వాములవారు అతన్నిసూటిగా చూస్తూ "స్వామివారికి ఇవ్వాళ తోటకూర తినాలనుంది. నాలుగు కట్టలిచ్చుకో" అనేవారు.

అతను ఇక తప్పదన్నట్టు నాలుగు కట్టలిస్తుంటే "మరో రెండు కట్టలిచ్చుకో... బేరం బావుంటుంది" అనేవారు. మరో రెండు కట్టలిచ్చుకుని అతను నీరసంగా బుట్ట తలకెత్తుకు వెళ్తుంటే "నారాయణ! నారాయణ" అని ఆశీర్వదించేవారు.

గుళ్ళోకి వెళ్ళేవాళ్ళు, వచ్చేవాళ్ళు మొదటి ప్రాకారంలోంచి పోవలసిందే. అలా వచ్చిపోయే వాళ్ళెవరూ సూరయ్యస్వాములవారి పిలుపు తప్పించుకోలేరు. చిల్లర కొట్టు సుబ్బయ్య గుళ్ళోనుంచి తిరిగి వెళ్తున్నాడు.




"ఎవరా పోయేది...?" స్వాములవారి పిలుపు.

సుబ్బయ్య గుండె గతుక్కుమంది. ఇక తప్పదని వెళ్ళి నమస్కారం చేసి కూర్చున్నాడు.

"వ్యాపారం బాగా సాగుతోందా? పిల్లలు బావున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేసి స్వాములవారు అసలు సంగతి బయటపెట్టారు. "స్వామివారికి ఇవాళ గారెలు తినాలని ఉందోయ్!"

సుబ్బయ్య గుండెల్లో రాయి పడింది. "ద...ద... దానికేముంది" అన్నాడు.


సూరయ్యస్వాములవారు ఆనందపడిపోయి "నాకు తెలుసు... సర్వసంగపరిత్యాగులం, మా కోరిక తీర్చడానికి నువ్వు వెనకాముందూ ఆడ్తావా? ఓ మానెడు మినప్పప్పు, వీశెడు నూనె, మిగిలిన సంబారాలు ఇంటికి పంపించు... ఆ ...అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమెర కూడా పంపు... ఆ కాస్త పుణ్యం మళ్ళీ ఇంకొకళ్ళకెందుకు దక్కాలి..." అన్నారు. సుబ్బయ్య గొంతులో తడి ఆరిపోయింది. కూర్చుంటే ఇంకా ఏమి మీదపడ్తాయోనని లేచి నంగి నంగిగా అన్నాడు.

"అయ్యా... తమరు ఒక్కరే గదా! గారెలకు మానెడు పప్పు..."

సూరయ్యస్వాములవారు నవ్వుతూ తక్షణ సమాధానం చెప్పాడు- "పిచ్చివాడా... అంతా నా ఒక్కడికేనా? స్వామివారి ప్రసాదం నలుగురూ నాలుగు ముక్కలు తింటే నీకు మరింత పుణ్యం కదుటయ్యా!"

సుబ్బయ్య మారుమాట్లాడకుండా లేచి వెళ్ళిపోయాడు.

సూరయ్యగారు సన్యాసాశ్రమం స్వీకరించిన ఉదంతం, దానిక్కారణాలు చాలా కొద్దిమందికి తెలుసు. దావాల్లో వున్న పొలం కాస్తా పోయింది. ఎదిగొచ్చిన కొడుకు జులాయిగా తిరగడం తప్ప సంపాదన లేదు. పైగా వాడికి పెళ్ళి కూడా చేశాడు. దాని ఫలితంగా ముగ్గురు పిల్లలు, ఇంట్లో పక్కవాటా అద్దెకిస్తే వచ్చే అద్దె డబ్బు పిల్లల చదవ్వాలకి సరిపోవడంలేదు. ఎక్కడా పైసా అప్పు పుట్టటంలేదు. సూరయ్య కనిపిస్తే అప్పు అడుగుతాడేమోనని జనం తప్పుకు తిరుగుతున్నారు. మూడు రోజులయింది పొయ్యిలో పిల్లి లేచి. ఊరు తిరిగాడు, వాడ తిరిగాడు- ఎక్కడా డబ్బు పుట్టలేదు. పిల్లలు ఆకలికి గొల్లుమంటున్నారు. పెళ్లాం, కోడలు కూడా తోటకూర కాడల్లా వాలి చెంగులు పరుచుకు పడుకున్నారు. సంసారాన్ని చూశాడు. విరక్తి కలిగింది, ఛీ అనుకున్నాడు. తక్షణ వెళ్ళి సన్యాసాశ్రమం స్వీకరించాడు. కాషాయం కట్టి కమండలం ధరించగానే ఊరు ఊరంతా వచ్చి ప్రణాచారంపట్టారు. పాదోదకం నెత్తిన చల్లుకున్నారు. గాలిగోపురం పక్కగది ఖాళీ చేయించి స్వాములవారి కిచ్చారు. ఆ నాటి నుంచీ సూరయ్యగారికిగాని, సూరయ్య గారి కుటుంబానికి గానీ చీకూ చింతా లేదు. దివ్యంగా కాలం గడచిపోతోంది.



సూరయ్యగారు భిక్షకు పిలిపించుకునే విధం చాలా హుందాగా వుండేది.

సుబ్బరామయ్య కనిపించాడనుకోండి. ఇలా జరిగేది సంభాషణ-

"ఎవరా పోయేది? సుబ్బరామయ్యేనా?"

"నేనే స్వామీ, పిల్చారా?"

"కూర్చో, పంటలు బాగా పండుతున్నాయా? పెద్దమ్మాయి కాపరానికెళ్ళిందా?"

"మీ దయవల్ల అంతా సక్రమంగానే జరిగిపోతోంది..."

"నారాయణ! నారాయణ! సుబ్బరామయ్యా! స్వామివార్ని భిక్షకు పిలిచి మూణ్ణెల్లు దాటినట్టుందే?"

"తమ సెలవయితే..."

"ఆహ్వానించకుండా స్వామివారు భిక్షకొచ్చి అనుగ్రహిస్తారటయ్యా!"

"తమరి దయ అయితే ఈ రోజే భిక్షకు దయ చేయండి."

"అలా అన్నావు బావుంది. పెద్దగా ఏర్పాట్లు ఏమీ చెయ్యకు. రెండు కూరలు, రెండు పచ్చళ్ళు చాలు. నేతి తిరగమోతలు మర్చిపోబోకు. గారెలు ఎలాగూ వండిస్తావు; తీపి పిండివంట విషయంలో పాలపూరీలు చేయించు. దంతసిరి తగ్గిపోయింది."

"అలాగే."

"పన్నెండో గంటకల్లా వచ్చేయి. ఆలస్యమైతే వుండలేము- రాత్రి ఫలహారం సంగతి ఆనక చెప్తా."

ఇలాగే నిత్యమూ తనకి భిక్ష ఏర్పాట్లుచేసుకుంటూ, కనిపించిన వాళ్ళందరిచేతా ఇంటి ఏర్పాట్లు చేయించేవారు సూరయ్యస్వాములవారు. ఒకరోజు సీతారామయ్యగారింట్లో భిక్ష కుదిరింది. పన్నెండై నెత్తి మాడుతున్నా



రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ప్రథమాధ్యక్షుడు, దివంగత ఆర్.బి. రామకృష్ణరాజు స్మారక అవార్డును ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘం చైర్మన్ డాక్టర్ బి. కృష్ణంరాజుకు అందజేస్తున్న రాష్ట్ర లఘు పరిశ్రమలు-జౌళి శాఖామాత్యులు శ్రీ కె. రామచంద్రరాజు, రాష్ట్ర పర్యాటక, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల మంత్రి శ్రీ అల్లాడి రాజ్‌కుమార్, శ్రీ జి. విజయరాజ్, శ్రీమతి ఆర్. కుసుమా రామారావు చిత్రంలో వున్నారు.

సీతారామయ్య పిలుపుకు రాలేదు. కడుపులో ఆకలి మెలితిరిగిపోతోంది. ఒంటిగంట వేళ సీతారాయమ్య వచ్చి చెప్పాడు- "స్వామీ! మా ఇంట్లో అశుచి వచ్చింది. ఇవ్వాల్టికి భిక్ష కుదరదు" అని. స్వాములవారి నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఆ మించిపోయిన వేళ ఎవరింటికి వెళ్తాడు?

నీరసంగా పావుకోళ్ళు వేసుకుని సరాసరి ఇంటి కొచ్చాడు. ఇంట్లో అంతా భోజనాలు చేసి తాంబూలాలు నములుతూ పడుకుని వున్నారు. "భిక్ష ఎక్కడా కుదర లేదు- ఇంట్లోనే" అన్నాడు సూరయ్యస్వాములవారు.

"సరి సరి! గిన్నెలు కడిగేసుకుని మేం పడుకుంటే ఇప్పుడేం భిక్ష" అంది కోడలు.

కొడుకు విని కూడా అటు తిరిగి పడుకున్నాడు.

భార్య వినీ విననట్టు పడుకుని పీటమీంచి తల ఎత్తలేదు. స్వాములవారికి కడుపులో మంటలు, గుండెల్లో మంటలు- సిగ్గు విడిచి భార్యతో చెప్పాడు. "ఇవ్వాళ భిక్ష దొరకలేదే! ఓ ముద్ద పెట్టవే?"

భార్య లేచి కూర్చుని అంది-"నాకసలే నడుం నొప్పి. నేనెక్కడ వంట చేస్తాను. ఏవే, ఓ గ్లాసు మజ్జిగ వుంటే ఇవ్వు. ఈ పూటకి సరిపెట్టుకుంటారు" అని కోడలికి చెప్పింది.

సూరయ్యగారి కింద భూమి కదిలిపోయింది. ఇదా సంసారం? ఛీ. అనుకుంటూ కాషాయ వస్త్రాలు చింపే శాడు, కమండలం 'ఢం' అని బద్దలుకొట్టాడు. దండం విరిచేశాడు. నిజమైన విరక్తితో సరాసరి కాశీ వెళ్ళి అసలైన సన్యాసం స్వీకరించాడు.

ఆరోజు నుంచి మొదటి ప్రాకారంలో "ఎవరా పోయేది?" అన్న గొంతు వినిపించకపోతే ఏవిటో బోసిగా వుండేది కొన్నాళ్ళు.

# టి.వి. సమీక్ష

హైదరాబాద్ దూరదర్శన్ ద్వారా ప్రసారమై ప్రేక్షకులను ఆకట్టుకొనే కార్యక్రమాలలో 'జాబులు-జవాబులు' ఒకటి. పూర్వం ప్రేమామాన్వి ఉత్తరాలు చదువుతుంటే ఓలేటి పార్వతీశం సమాధానాలు చెప్పేవారు. గత కొద్ది కాలం నుండీ అనౌన్సరు రోజారాణి/ విజయదుర్గ ఉత్తరాలు చదువుతుంటే సి. రామానుజాచార్యులు సమాధానాలు చెబుతున్నారు. ఆచార్యులవారు ప్రేక్షకుల ప్రశ్నలకి 'మా స్నేహితుడొకాయన' అంటూ పిట్టకథలు చెప్పడం ప్రారంభించారు. ప్రశ్నలకి 'ఆ, ఊ'లు సమాధానాలు కాకుండా సంతృప్తికరమైన విధంగా, కొంచెం చమత్కారం జోడించి చెప్తే చూసే వాళ్ళకి ఉత్సాహంగా ఉంటుంది. ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిలో ఆచార్యులవారు సమాధానాలు చెప్పటం లేదని చాలామంది ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. మార్చి 25 శుక్రవారం నాటి 'జాబులు-జవాబులు' ద్వారా ఏప్రిల్ నెల నుండీ హైదరాబాద్ టి.వి కార్యక్రమాలలో జరిపే కొన్ని మార్పులు తెలిసాయి. చిత్రలహరి ప్రతి గురువారం 7.05 కి కాకుండా 7.40 నుంచి ఏకధాటిగా 8.40 వరకూ ఉంటుంది. అలాగే మంగళవారం నాడు ప్రసారమయ్యే నాటకం కూడా 7.40కే ప్రారంభమవుతుంది. ఈ రెండు మార్పులు ప్రేక్షకులు, సమీక్షకులు కోరుకున్నవే, సూచించినవే.

* * * *

ప్రతి శనివారంనాడు ప్రసారమయ్యే తెలుగు చలన చిత్రం కోసం అశేష ప్రేక్షకులు ఎదురు చూస్తుంటారు. శ్రీరామనవమి లాంటి పండుగ దినాలలో మామూలు సాంఘిక చిత్రం కాకుండా రఘురాముడిమీద ఒక మంచి పౌరాణిక చిత్రం ప్రసారం చేస్తే బావుండేది. 'సీతారామకళ్యాణం', బాపు 'సంపూర్ణరామాయణం' లాంటి చిత్రాలు మన హైదరాబాద్ దూరదర్శన్ వారి వద్ద లేవా? కనీసం ఇక నుండి పండుగలు, పర్వదినాలలోనైనా పౌరాణిక చిత్రాలకి స్థానం కల్పించటం సముచితం.

## విశాల—విశ్వం

హైదరాబాద్ దూరదర్శన్ ద్వారా ప్రసారమయ్యే నాటకాలు ఏ కోణం నుంచీ చూసినా ఉత్తమ స్థాయిలో ఉండవు. ఇతివృత్తాలలో కొత్తదనం మచ్చుకైనా కన్పించదు. మార్చి 29, మంగళవారం 7.40 కి 'విశాల-విశ్వం' నాటకం ప్రసారమైంది. ఎమ్.గపూర్ బేగ్ వ్రాసిన ఈ నాటకం మనకందరికీ తెల్సిన పాత ముక్కోణపు ప్రేమకథ. నాటకంలో రసవత్తరమైన సంభాషణలు లేనే లేవు. ఈ నాటకంలో హీరో, హీరోయిన్ల పేర్లు 'విశాల', 'విశ్వం'. అదే నాటకం పేరు 'విశాల-విశ్వం'. కానీ మన టి.వి అనౌన్సర్ల నోటిలో పడి అది 'విశాల విశ్వం'గా మారింది. పేరు విని ఇదేదో సైన్స్ ఫిక్షన్‌కో అంతరిక్షానికో సంబంధించిన నాటకమని అంతా భ్రమపడ్డారు. అయినా ఎంతసేపూ ఇలాంటి ముక్కోణపు ప్రేమ కథలు తప్ప సైన్స్ ఫిక్షన్‌కి సంబంధించిన రచనలు హైదరాబాద్ దూరదర్శన్ వారి కంటికి ఆనడం లేదా?

## రమ్య రంగ స్థలి

మార్చి 27 ప్రపంచ నాటక దినోత్సవం. ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం 8.30 కి 'రమ్య రంగస్థలి' అనే వాణిజ్య కార్యక్రమం ప్రసారమైంది. జీ.ఎస్.ఆర్. మూర్తి నాటక కళా పరిషత్ గత కొద్ది సంవత్సరాలుగా విజయవాడలో ప్రతియేటా భారీ ఎత్తున నాటకోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ నాటకోత్సవాలను టి.వి.లో 'రమ్య రంగస్థలి' పేరిట ప్రసారానికై ఇన్నొవేషన్స్ లాంటి వ్యాపార సంస్థలు స్పాన్సర్ చేసాయి. చలన చిత్ర దర్శకుడు దాసరి నారాయణరావు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సాంకేతిక లోపాలు జయించే ప్రయత్నం ఇది.

—కల్పనా రెంటాల